ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు

5★★★

శనివారం 30 ఆగస్టు 2025



పంచాయతీ ఓటర్ల లెక్క సిద్ధం



- పల్లె ఓటర్లు 3,52,134 మంది
- గ్రామాల్లో ముసాయిదా జాబితాల ప్రదర్శన
- నేడు అభ్యంతరాల స్వీకరణ.. రేపు పరిష్కారం
- సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితా వెల్లడి
- జిల్లాలో 260 గ్రామపంచాయతీలు.. 2,268 వార్డులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గ్రామాల్లో ఎన్నికల హడావుడి మొదలైంది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఓటరు ముసాయిదా జాబితాలను ప్రదర్శించడంతో ఆశావాహులతో పాటు గ్రామీణుల్లో ఎన్నికలపై ఆసక్తి చోటుచేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలు, 12 మండల పరిషత్ కార్యాలయాల్లో ఓటర్ల వివరాల జాబితాలను అధికారులు అందుబాటులో ఉంచారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శనివారం మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 30వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, 31న పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. అదేరోజు అభ్యంతరాలను పరిష్కరించి ఓటరు జాబితాను సవరిస్తారు. సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితాను వెల్లడిస్తారు.

● బ్యాలెట్ బాక్సులు సిద్ధం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీ ఉండగా 2268 వార్డులు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 352134 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చి గ్రామాల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రదర్శించారు. గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలను రూపొందించే క్రమంలో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండే విధంగా సవరించారు. మృతిచెందిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించారు. కొత్త ఓటర్లను జాబితాలో చేర్చారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లాలో 200 మంది ఓటర్లు ఉన్న గ్రామాల్లో 1734పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల వరకు 468పోలింగ్ కేంద్రాలు, 650 ఓటర్ల వరకు ఉన్న పంచాయతీ ల్లో 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. పంచాయతీ ఎన్నికల్లో 650మంది ఓటర్లకు....

మిగతా 8లో

ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్లు

మండలం	పంచాయతీలు	వార్డులు	ఓటర్లు
బోయినపల్లి	23	212	30,505
చందుర్తి	19	174	28,094
ఇల్లంతకుంట	35	294	40,546
గంభీరావుపేట	22	202	36,807
కోనరావుపేట	28	238	35,225
ముస్తాబాద్	22	202	38,500
రుద్రంగి	10	86	13,665
తంగళ్లపల్లి	30	252	38,862
వీర్నపల్లి	17	132	11,727
వేములవాడ	11	104	18,492
వేములవాడరూరల్	17	146	18,825
ఎల్లారెడ్డిపేట	26	226	40,886
మొత్తం	260	2268	3,52,134

● ముందుగా సర్పంచ్ ఎన్నికలే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుగా హైకోర్టు ఆదేశం మేరకు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావిస్తున్నారు. తుది ఓటరు జాబితా సిద్ధమవుతుండడంతో గ్రామాల్లో ఆశావహుల్లోనూ హడావుడి పెరిగింది. గ్రామాల్లో పెద్దలను, వివిధ కుల సంఘాల మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ తేలకపోయినా పార్టీపరంగా రిజర్వేషన్ ఇచ్చే చర్చ కూడా జరుగుతోంది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీసీ నాయకులు పోటీ ఆసక్తి పెరిగింది.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్

- శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ మూలవాగులో పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఫామ్‌హౌస్‌లో ఉంటూ చక్రవర్తిలా రాష్ట్రాన్ని పరిపాలించి అప్పుల కుప్పగా మార్చింది మీ నాన్న కేసీఆర్ కాదా అని కేటీఆర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. వేములవాడ పట్టణంలోని మూలవాగు వద్ద శుక్రవారం గంగమ్మ తల్లికి చీర, పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని గంగమ్మ తల్లిని వేడుకున్నామన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కడెం వంటి ప్రాజెక్టులు చెక్కుచెదరకుండా ఉన్నాయని, లక్ష కోట్లతో నిర్మించామని గొప్పలు చెబుతున్న కాళేశ్వరం కృంగిపోయిందని విమర్శించారు. నర్మాల వద్ద పలువురు వరదలో చిక్కుకుంటే కేటీఆర్ వచ్చి రాజకీయాల గురించి మాట్లాడారని, వరదల్లో చిక్కుకున్న వారికి సహాయం చేయడం మరిచిపోయి కేటీఆర్ రాజకీయాలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వచ్చేటప్పటికే హెలికాప్టర్‌లు వచ్చి బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చామని, సందర్భం కాకున్న కేటీఆర్ బురద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారని గుర్తు తెలిపారు. పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీసం బ్రిడ్జిలను కూడా నిర్మించలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రకృతి వైపరీత్యంవల్ల వరదలు వస్తే సహాయం చేయాల్సిందిపోయి అక్కడ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం హేయమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చిస్తున్నామని, గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా కేసీఆర్, కేటీఆర్ కోర్టుకు వెళ్లి కాళేశ్వరం విచారణపై స్టే ఇవ్వాలని అడిగారని, తప్పు చేయనప్పుడు ఎందుకు భయమని ప్రశ్నించారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరంపై చర్చలో పాల్గొనాలని, బీఆర్ఎస్ పరిపాలనలో వారు చేసినవన్నీ స్కాములేనని, కాళేశ్వరం, గొర్లు, బర్లు, చాపలు వేటిని వదలకుండా అన్ని స్కాములే చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్ కాంగ్రెస్ నాయకులు కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, చిలుక రమేష్, సాగరం వెంకటస్వామి, అక్రమ్, నాగుల విష్ణుప్రసాద్, బింగి మహేష్, పులి రాంబాబు, ఇప్పపూల అజయ్, పుల్కం రాజు, అన్నారం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఖాతాదారులకు సైబర్ సెక్యూరిటీ ఏర్పాటు

- అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

- 2025-26 వార్షిక అంచనా బడ్జెట్ రూ 13 కోట్లు ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

సిరిసిల్ల ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఖాతాదారులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించే దిశగా సైబర్ సెక్యూరిటీని ఏర్పాటు చేశామని, బ్యాంక్ సీ గ్రేడ్ నుంచి బి గ్రేడ్‌కు పెరిగిందని సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల పద్మశాలి కళ్యాణ భవనంలో బ్యాంక్ వార్షిక మహాసభ జరిగింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ రూ 13 కోట్లను ఆమోదించారు. బ్యాంకుకు సంబంధించిన వివిధ అంశాలపై సభ్యులు ప్రశ్నించారు. వార్షిక నివేదికను ఇంగ్లీష్‌లో ముద్రించినందుకు వేదిక వద్ద పలువురు సభ్యులు నిరసనలు తెలిపారు. బ్యాంక్ సీఈవో పత్తిపాక శ్రీనివాస్ ఆర్‌బీఐ నిబంధనల మేరకు నివేదిక రూపొందించామని తెలిపారు. సభ్యుల సూచన మేరకు తెలుగులో కూడా అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్యాంక్ పరిధిని విస్తరించడానికి దాదాపు 8బ్రాంచీలు స్థాపించడానికి అవకాశం ఉందని, ఈ ఆర్థిక సంవత్సరం రెండు బ్రాంచీలను ఏర్పాటుచేయడానికి పాలకవర్గం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోందన్నారు. ఖాతాదారులు సికేవైసీ చేసుకోవాలని కోరారు. బ్యాంకు డిపాజిటు రూ.94.15 కోట్లు ఉందని, 14మాసాల్లో బ్యాంక్ డిపాజిట్లు రూ.18కోట్లు పెరిగాయన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి మొబైల్ బ్యాంకింగ్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. బ్యాంక్ సీఈవో పత్తిపాక శ్రీనివాస్ వార్షిక నివేదికను సభ్యుల ముందుంచారు. వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి, మాజీ అధ్యక్షుడు గూడూరి ప్రవీణ్, గాజుల బాలయ్య, గాజుల నారాయణ, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల చుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, వలస హరిణి, పత్తిపాక సురేష్, కోడం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమలకు ఈఆర్‌సీ ఆదేశాల మేరకు బ్యాక్ బిల్లింగ్

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలకు ఈఆర్‌సీ ఆదేశాల మేరకు బ్యాక్ బిల్లింగ్ చేశామని, ఇప్పటివరకు రూ 32.23 కోట్ల బకాయిలను చెల్లించాలంటూ వ్యాపారులందరికి నోటీసులు అందించినా స్పందించకపోవడంతోనే విద్యుత్ కనెక్షన్‌లను తొలగించామని సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరెంట్ బాకాయిలను చెల్లించాలంటూ నోటీసులు అందించిన స్పందించకపోవడంతోనే పరిశ్రమలకు కరెంట్ కనెక్షన్‌లను తొలగించడంతో వస్త్ర వ్యాపారులు తరలివచ్చి సెస్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయడం సరి కాదన్నారు. ఈఆర్‌సీ నిబంధనల ప్రకారం ఎస్ఎస్ఐ యూనిట్‌లకు సంబంధించి రూ 32.23 కోట్లు బకాయిలు ఉన్నాయని ఇందులో నుంచి కేవలం బ్యాక్ బిల్లింగ్‌ను మినహాయించి కరెంట్ బిల్లులను చెల్లించాలంటూ యజమానులకు చెప్పామన్నారు. యూనిట్‌కు 7 రూపాయలు చెల్లించలేమని వ్యాపారులు ఆందోళనలు చేపట్టడంతో కలెక్టరేట్‌లో కలెక్టర్ తమ పాలకవర్గంతో సమావేశాన్ని ఏర్పాటుచేసి యూనిట్‌కు రూ.2చొప్పున తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో అంగీకరించిన వ్యాపారులు మాత్రం అ డబ్బులు కూడా చెల్లించలేదన్నారు. పరిశ్రమలకు సంబంధించిన కనెక్షన్లను తొలగిస్తే వ్యాపారులు తమతో మాట్లాడకుండా సెస్ ఎదుట ధర్నా చేయడం సరైందికాదన్నారు. ఇప్పటికైనా వ్యాపారులు స్పందించి బ్యాక్ బిల్లింగ్ డబ్బులు కాకుండా వాడుకుంటున్న కరెంట్ బిల్లులను చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డైరెక్టర్‌లు దార్నం లక్ష్మీనారాయణ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

2న తుది జాబితాల ప్రచురణ

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఓటర్ల తుదిజాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా సెప్టెంబర్ 2న ప్రచురించడం జరుగుతుందని, దీనిపై అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రంలోగా అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామపంచాయితీ ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్ట్‌లపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12 మండలాల పరిధిలో 260 గ్రామపంచాయతీలలో 2268 వార్డులో 3లక్షల 52వేల 134 మంది ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆగస్టు 28న విడుదల చేసి గ్రామపంచాయతీ కార్యాలయాలల్లో అంటించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ వారిగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఆ జాబితాలను పరిశీలించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే శనివారంలోగా తెలియజేయాలన్నారు. ఆగస్టు 31లోపు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. ప్రతి మండల పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2268 డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో ఆగస్టు 28న తయారుచేశారని వీటిపై అభ్యంతరాలు ఉంటే ఎంపీడీవో కార్యాలయాల్లో శనివారం సాయంత్రంలోగా అందించాలని కోరారు. సెప్టెంబర్ 2న తుది పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేయడం జరుగుతుందన్నారు. 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటుచేయడం జరుగుతుందని, జిల్లాలో ఎక్కడైనా అదనపు పోలింగ్ కేంద్రం అవసరం ఉంటే వివరాలు అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, డివిజనల్ పంచాయతీ అధికారి నరేష్, రాజకీయ పార్టీలకు చెందిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తెలుగు దేశం పార్టీ నాయకులు తీగల శేఖర్‌గౌడ్, తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బ్యాక్ బిల్లింగ్‌ను రద్దు చేయాలి



సెస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వస్త్ర వ్యాపారులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల విద్యుత్ బ్యాక్ బిల్లింగ్‌లను రద్దుచేయాలని పాలిస్టర్ ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడెపు భాస్కర్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, సీసీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవిలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంతో పాటు చంద్రంపేట, తంగళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం సెస్ అధికారులు వస్త్ర పరిశ్రమలపై దాడులు చేసి బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్‌కనెక్షన్‌లను తొలగించారు. ఆగ్రహించిన వస్త్రవ్యాపారులు సెస్ ప్రధాన కార్యాలయానికి చేరుకుని చైర్మన్‌తోపాటు ఎండీతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, ఎవరు పట్టించుకోకపోవడంతో జేఏసీ నాయకులతో కలిసి వస్త్ర వ్యాపారులు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నా చేస్తుండగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కార్యాలయానికి వచ్చిన వారిని పట్టించుకోకపోవడంతో ఆగ్రహంతో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. జేఏసీ నాయకులతో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సిరిసిల్లలో ఇందిరా స్వశక్తి మహిళా చీరల ఉత్పత్తిని అడ్డుకుని ప్రభుత్వానికి చెడ్డపేరును తేవడం కోసమే సెస్ పాలకవర్గం వస్త్ర పరిశ్రమలపై కక్షపూరిత వైఖరిని చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా బదనాం చేయడంలో భగంగానే అనేక రకాల నిబంధనలను పెడుతూ ఈ నాలుగు నెలల్లోనే నాలుగుసార్లు కనెక్షన్లను తొలగించారన్నారు. వస్త్రపరిశ్రమలపై సెస్ పాలకవర్గం, అధికారులు కక్షపూరిత వైఖరిని అవలంభిస్తూ, బ్యాక్ బిల్లింగ్, సర్‌చార్జీలతో పాటు ఇతరత్రా బిల్లుల పేరుతో వ్యాపారులను వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల సిరిసిల్ల పర్యటనకు వచ్చిన చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డిలతో కలిసి బ్యాక్ బిల్లులను రద్దుచేయాలని విన్నవించి వినతిపత్రాన్ని అందించామని, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.సెస్ పాలకవర్గం వెంటనే తొలగించిన కనెక్షన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వస్త్ర వ్యాపారులు బూట్ల నవీన్, ఏనుగుల ఎల్లయ్య, బండారి అశోక్, యెల్లండి దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో కార్మికుల నిరసన ర్యాలీ

- 11వ రోజుకు చేరిన సమ్మె



టెక్స్‌టైల్ పార్కులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు పరిశ్రమలకు ఇస్తున్న ప్రభుత్వ ఆర్డర్ సోషల్ వెల్ఫేర్ వస్త్రానికి మీటరుకు రూ.20 లాభం పొందుతూ యాజమాన్యాలు కార్మికులకు కూలిపెంచకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ఆరోపించారు. తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కులో కార్మికులు కూలీ పెంచాలని చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరుకుంది. దీంట్లో భాగంగా శుక్రవారం టెక్స్‌టైల్ పార్కులో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ వస్త్రాలకు సిరిసిల్లలో కార్మికులు పొందుతున్న వేతనాల్లో 50శాతం కూడా టెక్స్‌టైల్ పార్కు కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. రోజుకు కనీసం రూ.1000 వేతనం వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండురోజుల్లోగా యజమానులు చర్చలు జరిపి కూలీ పెంచాలని లేకుంటే కార్మికులు సిరిసిల్లలో పని చేస్తూ టెక్స్‌టైల్ పార్కులో సమ్మె కొనసాగించడానికి కార్మికులందరు తీర్మానం చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు అధ్యక్షుడు కూచన శంకర్, జెల్లా సదానందం, కిషన్, శ్రీకాంత్, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న మానేరు వాగు

- మిడ్ మానేరు ప్రాజెక్టుకు 52493 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

- ఎల్ఎండీ, అన్నపూర్ణ ప్రాజెక్టుకు 19715 క్యూసెక్కుల నీరు..



సిరిసిల్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగు

సిరిసిల్ల ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతోంది. శుక్రవారం చినుకులతోనే సరిపెట్టగా, సిరిసిల్ల మానేరు వాగులో వరద ఉధృతి కొనసాగింది. శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 52493 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 19715 క్యూసెక్కులు ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 12వేల క్యూసెక్కులు వస్తుండగా, సిరిసిల్ల మానేరు వాగు నుంచి 40493క్యూసెక్కుల వరద నీరు మిడ్‌మానేరులోకి చేరుకుంటోంది. ప్రాజెక్టునుంచి అన్నపూర్ణ, ఎల్ఎండీ ప్రాజెక్టులకు 19715 క్యూసెక్కుల నీళ్లు వదిలారు. ఎగువమానేరు ప్రాజెక్టుకు 40195 క్యూసెక్కుల వరద నీళ్లు వస్తున్నాయి. మత్తడి దూకుతూ మానేరు వాగు నుంచి ప్రవహిస్తోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీల సామర్థ్యానికి 23.11 టీఎంసీలకు చేరుకుంది. జిల్లాలో శుక్రవారం ఉదయం వరకు 69.2మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రుద్రంగిలో 90.1 మిల్లీమీటర్లు, చందుర్తిలో 96.8 మిల్లీ మీటర్లు, వేములవాడరూరల్‌లో 52.9మిల్లీమీటర్లు, బోయినపల్లిలో 68.9 మిల్లి మీటర్లు, వేములవాడలో 104.8 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 50.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 60.2మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 117.9 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 46.4మిల్లీమీటర్లు గంభీరావుపేటలో 37.2మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 48.0మిల్లీమీటర్లు, తంగళ్ళపల్లిలో 58.0 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంటలో 67.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.. 8

తల్లీకొడుకుల అదృశ్యం: కేసు నమోదు



అదృశ్యమైన తల్లీ, కొడుకులు

శంకరపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తల్లీ కొడుకులు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామానికి చెందిన కోడూరి కీర్తన తన ఐదేళ్ల కుమారుడు వేదాన్ష్‌ను తీసుకొని ఇంటినుంచి బయటకు వెళ్లింది. తిరికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పక్కింటి వారు, బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేక పోయింది. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యులు కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై శేఖర్‌రెడ్డి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీతెలిసిన వారు 87126 70774, 9963909531 నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌లో రెండురోజుల కిందట అదే గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్‌పై దాడిచేసిన బొడిగె రాజశేఖర్, బొడిగె వెంకటేష్, జనుగాం సాయిమనీష్‌ను శుక్రవారం బైండోవర్ చేశామని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై మద్యం తాగి అడ్డుగా కూర్చుండడంతో పక్కకు జరగమని అడిగినందుకు దాడి చేసి గాయపరిచారని సీఐ తెలిపారు. రోడ్డుపై న్యూసెన్స్ చేసి శ్రీనివాస్‌పై దాడి చేసిన ముగ్గురిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లందకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామశివారులో శుక్రవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లా శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి ఒకే బైక్‌పై జమ్మికుంటనుంచి మల్యాల మీదుగా వెళ్తున్నారు. ఈక్రమంలో వీరిని మల్యాల గ్రామ శివారులో ఎదురుగా అతివేగంగా నిర్లక్ష్యంగా ఓ వ్యక్తి పల్సర్‌బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డికి స్వల్పగాయాలు కాగా, తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. అల్లా శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనదారులపై వానర దాడులు

కొండముచ్చుల ఫ్లెక్సీల ఏర్పాటు



పొత్కపల్లి శివారులో రోడ్డుపై కోతులు

ఓదెల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండల కేంద్రం నుంచి పొత్కపల్లి వెళ్లే దారిలో కోతులు వాహనదారులను తరిమికొడుతున్నాయి. మూడు కిలోమీటర్ల దారిలో వెళ్లాలంటే ప్రయాణికులు, రైతులు జంకుతున్నారు. రోజు ఉదయం, సాయంత్రం వేళలో వందలాది వానరాల గుంపుల రోడ్డుపైకి వస్తున్నాయి. కోతులు వెంట పడుతున్న క్రమంలో వేగంగా వెళుతుండగా వాహనంపై నుంచి పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఆరు నెలల్లో 12 మంది ద్విచక్ర వాహన దారులు, 8 మంది రైలు ప్రయాణికులు, ఐదుగురు చిన్నారులపై కోతులు దాడి చేశాయి. భద్రాచలంకు చెందిన ఓ కుటుంబం పొత్కపల్లిలోని బంధువుల ఇంటికి శుభ కార్యానికి హాజరై తిరిగి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన సమయంలో మహిళను కోతుల గుంపు దాడి చేసి గాయపరిచింది. కోతుల బెడదతో విధి లేని పరిస్థితుల్లో ఓదెల నుంచి మడక మీదుగా పొత్కపల్లికి వెళుతున్నారు. ఓదెల శివారులోని పంటలు, కూరగాయల తోటలను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల గుంపు ఓదెల వైపు రాకుండా రైతులు కొండముచ్చుల చిత్రపటాలతో దాదాపు 15 ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీని వల్ల కొంత ఫలితాలు ఉంటుంది. కోతుల బెడద నుంచి అధికారులు కాపాడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఓదెలలో ఏర్పాటు చేసిన కొండముచ్చుల ఫ్లెక్సీలు

భార్యను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్యచేసిన కేసులో భర్తకు జీవితఖైదుతోపాటు రూ.2,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి రత్న పద్మావతి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాలోని రాయికల్ పట్టణానికి చెందిన అరిపెల్లి సత్తయ్య-సుధారాణి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తయ్య ఇంటి వద్ద ఉంటూ ఏ పని చేయకుండా నిత్యం భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఈ విషయంలో దంపతులకు గొడవల కారణంగా సుధారాణి ఇంటి నుంచి వెళ్లిపోయి తన ఇద్దరు కుమారులతో కలిసి అద్దెఇంటిలో ఉంటూ జీవనం కొనసాగిస్తోంది. అయినప్పటికీ సత్తయ్య వారు ఉంటున్న అద్దె ఇంటి వద్దకు వెళ్లి తన భార్యను చితకబాదడంతో సొంత ఇంట్లోనేఉంటూ భర్తతో వేరుగా ఉంటూజీవనం సాగిస్తోంది. 2020ఆగస్టు 16న మరోసారి భార్య, భర్తల మధ్య గొడవతో సత్తయ్య పదునైన ఆయుధంతో సుధారాణి గొంతు కోసి హత్యకు పాల్పడ్డాడు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఆరోగ్యం కేసు నమోదు చేయగా సీఐ కృష్ణకుమార్ కేసు దర్యాప్తు చేశారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సత్తయ్య జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుదాఘాతంతో దినసరి కూలీకి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భవనానికి రంగులు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైన దినసరి కూలీ అంగూరి సాగర్ తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామంలోని సాగర్ రంగులు వేస్తూ జీవిస్తున్నాడు. ఓభవనానికి రంగులు వేయడం కోసం కర్రలపైకి ఎక్కి పనులు చేస్తున్నాడు. పైన ఉన్న ఎల్‌టీ విద్యుత్‌తీగలకు చేతిలోని ఇనుప చువ్వ తగలడంతో కరెంటు షాక్‌కు గురయ్యాడు. కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రేపు జన విజ్ఞాన వేదిక శిక్షణ తరగతులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల ప్రజా సైన్స్ ఉద్యమ నాయకులు, కార్యకర్తల శిక్షణ తరగ తులను ఈనెల31న నగరంలోని ఫిలిం భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటేశ్వర్ రావు, కొడిముంజ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రం, శాస్త్ర ప్రచారం, సవాళ్లు అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రజాసైన్స్ ఉద్యమం, తాత్వికత, అనుభవాలు అనే అంశంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చలిమెల రాజేశ్వర్ సందేశమిస్తారని తెలిపారు.

ఐదు టీంలతో మానేరులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

సిరిసిల్ల కలెక్టరేట్/గంభీరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల వద్ద మానేరువాగులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం అధికారులు ఐదు బృందాలతో ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం మానేరు వాగు దాటుతండగా గల్లంతయ్యాడు. ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్యశాఖపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ సంయుక్తంగా గాలింపు ముమ్మరం చేశాయి. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మెరకు ఒక్కో టీంలో ఆరుగురు వ్యక్తుల చొప్పున ఐదు బృందాలుగా ఏర్పడి మానేరు వాగు వెంట ఉన్న చెక్‌డ్యాంలు, వంతెనలు, కల్వర్టులు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎస్ఐ అనిల్ నేతృత్వంలో నర్మాల, గంభీరావుపేట, మల్లారెడ్డిపేట మానేరు వాగు ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్ ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



మానేరులో గాలింపు కోసం ఏర్పాటు చేసిన టీంలు

రూ.1.50లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

జమ్మికుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ముద్ర లోన్ ఇస్తామని వాట్సాప్‌కు లింక్ పంపిన సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.1.50లక్షలు కాజేశారు. ఈ సంఘటన జమ్మికుంట మండలం అంకుశాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కడిపికొండ శివారెడ్డిఅనేవ్యక్తికి ఓ గుర్తు తెలియనివ్యక్తి నీకు ముద్రలోన్ మంజూరైందని వాట్సాప్‌కు లింక్‌పంపాడు. లోన్‌డబ్బులు రావాలంటే ముందుగా డబ్బులు పంపాలని నమ్మబలికి రూ.1.50లక్షలు కాజేశాడు. ఆ తర్వాత అవతలివ్యక్తి స్పందించ కపోవడంతో సైబర్ మోసానికి గురయ్యానని భావించిన శివారెడ్డిపోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. ఈమేరకుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

గోదావరిఖని బస్టాండ్ వద్ద వృద్ధురాలు మృతి

కోల్‌సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ వద్ద ఎన్‌టీపీసీ ఖాజిపల్లికి చెందిన గుమ్మడి రాజమ్మ(72) అనే వృద్ధురాలు శుక్రవారం మృతిచెందింది. గతంలో ఆమె తరచూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వచ్చేదని, ఒకసారి మేడారం వెళ్లి నాలుగు రోజులు ఉండి తిరిగి వచ్చిందని పోలీసులు పేర్కొన్నారు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రాజమ్మ గోదావరిఖని బస్టాండ్ వద్ద కింద పడడంతో ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. ఆమె కుమారుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అనూష తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌లో గూడ పుష్పలత(64) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పుష్పలత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని పేర్కొన్నారు. వ్యాధి నయం కానందున జీవితంపై విరక్తిచెంది శుక్రవారం ఇంటి పక్క ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుందని, ఆమె భర్త మాధవరెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఒకరికి 10నెలల జైలు శిక్ష

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకవ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి 10నెలల జైలుశిక్ష విధిస్తూ మెట్‌పల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2020సంవత్సరంలో నిజామాబాద్‌జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాజులసాయన్న అనే ఆటోడ్రైవర్ తన ఆటోను రోడ్డు పక్కన నిలుపుకున్నాడు. ఆ సమయంలో నిజామాబాద్ జిల్లా ముప్కాల్ గ్రామానికి చెందిన దుంపటి లక్ష్మీరాజ్యం అనేవ్యక్తి తన కారుతో అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాజుల సాయన్న తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. ఆధారాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి 10నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి సీఐ ఎల్‌శ్రీను, ఎస్సై ఎం అశోక్‌కుమార్, కానిస్టేబుల్ చక్రపాణిలను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు గండి

- ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేసిన రైతులు



ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

కథలాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు గండివేసిన నిజామాబాద్‌జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులపై ఇరిగేషన్ ఏఈకి శుక్రవారం రైతులు ఫిర్యాదు చేశారు. ఇటీవల మరమ్మతులు చేసిన నక్కల ఒర్రె ప్రాంతంలో కట్టను తెంపి గండి వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి ఎస్సైకి విన్నవించారు. గండి పడడం వల్ల భూషణరావుపేట, కథలాపూర్ రైతులకు కాలువ ద్వారా నీరు అందని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికే నాలుగుసార్లు ఇదేప్రాంతంలో గండి పడుతుండడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికకు ప్రేమ పేరుతో వేధింపులు..

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ చదువుతున్న ఒక బాలిక(16)ను ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. చొప్పదండి నియోజక వర్గానికి చెందిన బాలిక కరీంనగర్‌లోని ఒక కళాశాలలో ఇంటర్ చదువుకుంటూ ప్రతి రోజు బస్సులో కరీంనగర్‌కు వస్తుంటది. ఆమెకు 4నెలల కిందట మానకొండూర్ మండలం అర్నకొండకు చెందిన తమ్మడి రంజిత్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయమయ్యాడు. కొద్దిరోజుల నుంచి తనను ప్రేమించాలంటూ బాలికపై ఒత్తిడి తీసుకువస్తున్నాడు. బాలిక దీనిని నిరాకరించటంతో సోమవారం కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాలిక చెంపపై కొట్టాడు. ఆ తరువాత శుక్రవారం ఇంటివద్ద ఉన్న బాలికకు ఫోన్ చేశాడు. ఈ విషయాన్ని వెంటనే బాలిక తల్లిదండ్రులకు చెప్పగా బాలిక తల్లి కరీంనగర్‌కు వచ్చి ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. అయితే బాలికను ప్రేమించాలంటూ వెంటపడి వేధింపులకు గురిచేస్తున్న నిందితుడిని బాలిక తరపునవారు కరీంనగర్ కోర్టు చౌరస్తాలో పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు తెలిసింది.

బార్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



అపరిశుభ్రంగా నటరాజ్‌బార్‌అండ్ రెస్టారెంట్‌లోని వంటశాల

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి బస్టాండ్ పక్కన ఉన్న దర్బార్ బార్, నటరాజ్ బార్లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్బార్ బార్‌లో ముందురోజు మిగిలిన మటన్, మొక్కజొన్న, వెజ్ మంచూరియా వంటి ఆహారపదార్థాలు పారేసినట్లు తెలిపారు. పరిశుభ్రతకు సంబంధించిన లోపాలు గుర్తించామని, బార్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. నటరాజ్ బార్‌లో పరిస్థితి అధ్వానంగా ఉందని, కిచెన్ అపరిశుభ్రంగా దుర్వాసన వస్తోందన్నారు. సిబ్బంది ఆహారభద్రత జాగ్రత్తలు పాటించడం లేదన్నారు. దీంతో యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

ఎంజేపీ పాఠశాల తనిఖీ



రామకృష్ణ కాలనీలోని ఎంజేపీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌లాల్

తిమ్మాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీలో గల గన్నేరువరం మండలానికి చెందిన మహాత్మా జ్యోతీబాపూలే బాలుర పాఠశాలను గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్‌లాల్ శుక్రవారంం తనిఖీచేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న పరిస్థితులు, వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కూరగాయల మార్కెట్‌లో ఓవ్యక్తి పోగొట్టుకున్న పర్సును హోంగార్డు తిరిగి అప్పగించాడు. మార్కెట్ ప్రాంతంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు నర్సయ్యకు పర్సు దొరికింది. దానిని పరిశీ లించగా అందులో 6,500రూపాయల నగదు, 8ఏటీఎంకార్డులు, ఐడీ కార్డులు ఉన్నాయి. గుర్తింపు కార్డులపై ఉన్న వివరాల ఆధారంగా మాన కొండూర్ మండలం గంగిపెల్లికి చెందిన వ్యక్తి పర్సుగా గుర్తించారు. వెంటనే ఆవ్యక్తికి ఫోన్‌చేసి ట్రాఫిక్ ఎస్సై సురేష్‌సమక్షంలో అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు హోంగార్డును అభినందించారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనాలు పట్టివేత

జ్యోతినగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్ నుంచి అక్రమంగా విలువైన ఇనుప స్క్రాప్‌ను తరలిస్తున్న రెండు వాహనాలను గురువారం రాత్రి సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. టౌన్‌షిప్ నుంచి ట్రాలీ ట్రాక్టర్, హైడ్రా వాహనంలో భవన నిర్మాణాలకు వినియోగించే ఐరన్ వస్తువులను తరలిస్తున్నారు. సమాచారం అదుకున్న సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ జవానుల సమీపంలోని స్క్రాప్‌దుకాణంలో అన్‌లోడ్ చేసే సమయంలో పట్టుకున్నారు. డ్రైవర్లు సతీష్, గుడ్డు కుమార్ సింగ్, కబీర్ అన్సారీలను అదుపులోకి తీసుకొని, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్క్రాప్ మెటీరియల్‌ను ఎన్టీపీసీ అధికారులకు అప్పగించినట్లు సీఐఎస్ఎఫ్ సిబ్బంది తెలిపారు.



సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న వాహనాలు

ప్రమాదమైనా.. ఆగని ప్రయాణం

జూలపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ శివారులో గల హుస్సేనిమియా వాగుపై ఉన్న రోడ్‌డ్యాం శిథిలావస్థకు చేరినా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై నుంచి హుస్సేనిమియా వాగు వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజల ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు వ్యయప్రయాసలతో ఇతర ప్రాంతాల నుంచి వెళుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవా హంలో ప్రయాణించడం ప్రమాదం అని తెలిసినా కొందరు వాహనాల్లో వాగు దాటుతున్నారు. ఈ ప్రాంతంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించి ప్రజల ఇబ్బం దులను తొలగించాలని మండల ప్రజలు కోరుతు న్నారు.



వడుకాపూర్ హుస్సేనిమియావాగు ప్రవాహంలో ప్రయాణిస్తున్న కారు

నిండు కుండలా నీరుకుళ్ల మానేరు

- చెక్ డ్యామ్‌పై ప్రవహిస్తున్న నీరు

సుల్తానాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు పరివాహక గ్రామాలలో వరద ఉధృతి కొనసాగుతుంది. మానేరు వాగు నిండు కుండలా ప్రవహిస్తుంది. నీరుకుళ్లలోని రెండు చోట్ల చెక్ డ్యామ్‌లు ఉండడంతో వరద నీరు నిలిచి జల కళను సంతరించుకుంది. నీరుకుళ్ల వేగురపల్లి వంతెన నుంచి సందర్శకులు ఈ నీటి ఉధృతిని తిలకిస్తున్నారు. చెక్ డ్యామ్‌ల నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు ప్రకృతి అందాలను తిలకిస్తున్నారు.



మానేరు వాగు పై మత్తడి దూకుతున్న నీరు

చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

పెద్దపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్న రాణి అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని ప్రభుత్వబీసీ కళాశాల బాలురవసతిగృహం-2 లో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై విద్యార్థులకుఅవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, భాను, సంకీర్తన, ఆర్ ఝాన్సీ పాల్గొన్నారు.

ఓదెల: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు సివిల్‌కోర్టు జడ్జి దుర్గంగణేష్ పోక్సోచట్టంపై అవగాహన కల్పించారు. పోక్సో కేసునమోదైతే తమ భవిష్యత్తుపై తీవ్రప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆకారపు సరోత్తంరెడ్డి, ఎస్సై దీకొండ రమేష్, పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పశు వైద్యశాలలు

- మంథని, పుట్టపాకలలో వైద్యుల పోస్టులు ఖాళీ
- శిథిలావస్థలో భవనాలు
- ఆందోళనలో ఉద్యోగులు

మంథనిరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని పశువైద్యశాలల్లో సమస్యలతో సతమతమవుతున్నాయి. వైద్యశాలల్లో డాక్టర్లు లేక పోవడం, భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మంథని ఏరియా వెటర్నరీ ఆసుపత్రితోపాటు, మండలంలో గుంజపడుగు, పుట్టపాకలో ప్రాథమిక పశువైద్యశాలలు ఆరెందలో గ్రామీణ పశువైద్యకేంద్రాలు ఉన్నాయి. ఇందులో మూడు నెలలుగా మంథని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. పుట్టపాక ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ పోస్టులతోపాటు గుంజపడుగు, ఆరెందలలో అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంథని, పుట్టపాకలో వెటర్నరీ అసిస్టెంట్‌లు ప్రస్తు తం వైద్య సేవలు అంది స్తున్నారు. వర్షా కాలంలో పశువులకు, మేకలు, గొర్రెలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చర్మ, మూతివాపు, గాలికుంటు వ్యాధులు ప్రబలుతాయి. వైద్యులు లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంజపడుగు పశువైద్యాధికారి ఇన్‌చార్జిగా ఉండటంతో ఆయనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు మంథని కేంద్రంలో ఉన్న పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకొంది. వర్షాకా లంలో భవనం పైకప్పు పెచ్చులు ఊడి పడు తుండటంతో సిబ్బంది, ఆసుపత్రికి వచ్చే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గుంజపడుగు, పుట్టపాక, ఆరెంద పశు వైద్యశాల భవనాల మరమ్మతులకు ప్రతి పాదనలకు పంపించారు. అధికారులు స్పందించి డాక్ట ర్లను, సిబ్బందిని నియమించడంతో పాటు మంథనిలో భవన నిర్మాణం, పుట్టపాక, గుంజ పడుగు, ఆరెంద పశు వైద్యశాలల భవనాలకు మరమ్మతు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గుంజపడుగులో పాతబడిన పశు వైద్యశాల భవనం

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద


దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం భారీగా వరద నీరు వస్తోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 39 గేట్లు పైకి ఎత్తి 5,04,455 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 65.135 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 12,000 క్యూసెక్కులు వదులుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న వరద

బోయినపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు)ఎగువన కురిసిన భారీ వర్షాలకు మానేరు వాగు నుంచి ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయానికి 44,700 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి 19,715 నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 316.49 మీటర్లు ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 23.69 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.34టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

20 టీఎంసీలు దాటిన ఎల్‌ఎండీ

తిమ్మాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నీటితో కళకళలాడుతోంది. రెండురోజులుగా వస్తున్న భారీ ఇన్‌ఫ్లో శుక్రవారానికి కాస్త తగ్గింది. గురువారం మధ్యాహ్నం వరకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా శుక్రవారం ఉదయం ఏ క్షణమైనా ఎల్‌ఎండీ స్పిల్వే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో శుక్రవారం గేట్లు తెరవడం లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు ప్రాజెక్టులోకి 33,351 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఎల్ ఎండీ పూర్తిస్థాయి నీటి మట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.74 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు బారీగా వరద నీరు వస్తున్నది. శుక్రవారం సాయంత్రం వరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 7,26,974 క్యూసెక్కుల వరకు వరద నీరు రావడంతో గోదావరిలోకి 41 గేట్ల ద్వారా 7,45,257 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పరిశీలిస్తూ నీటిని దిగువకు వదిలి పెడుతున్నారు.

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి


ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి

ధర్మపురి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది వరద శుక్రవారం వేగంగా కొనసాగుతోంది. గోదావరి ఎగువ మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతుంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం- నారాయణరెడ్డి ప్రాజె క్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీనికి తోడుగా ఎస్ఆర్ ఎస్పీ, కడెం ప్రాజెక్టు గేట్లు తెరచి నీరు విడుదల చేశారు. దీంతో గోదావరి క్షణ క్షణం నీటి మట్టం పెరిగి ఉధృతంగా ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం సంతోషీమాత, గోదావరి మాత ఆలయాల్లోకి వరద నీరు చేరింది. శ్రీ దత్తాత్రేయస్వామి, శ్రీ రామలయం వరకు కూడా నీరు చేరింది.. గోదావరి నదీ ఒడ్డున గల చిరు వ్యాపారులను అధికారులు ఖాళీ చేయించారు. దీనికి తోడుగా ధర్మపురి, రాయపట్నం వద్ద ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల రెండు జిల్లాల సరిహద్దుల గల గ్రామాలకు చెందిన ఒడ్డు ఆనుకుని నీటి ప్రవాహం వేగంగా కొనసాగుతుంది. ధర్మపురి వద్ద భక్తులు లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయరాదని ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, నదిలో చేపలు పట్టడం కోసం వెళ్లే మత్స్యకార్మికులకు లోతు ప్రదేశాలకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్ రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ వరద పరిస్థితి సమీక్షించారు.


సంతోషీమాత ఆలయంలోకి చేరిన వరద నీరు

వానాకాలం.. వ్యాధులతో భద్రం

- వాతావరణ మార్పుల కారణంగా వ్యాప్తి
- ముందస్తు చర్యలతో కట్టడి



సుభాష్‌నగర్, ఆగస్టు 29: వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి. ఈ కాలంలో సంభవించే అనూహ్య మార్పులు ప్రజా రోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. వర్షాలతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతాయి. పారిశుధ్యం, ఆహారంపై ప్రత్యేక దృష్టిసారించాలి. ముఖ్యంగా సకాలంలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, గుంతల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయి. ఈ సీజన్‌లో వ్యాధులు సులభంగా వ్యాపిస్తాయి. సూక్ష్మజీవుల కారణంగా వచ్చే మలేరియా, కలరా, డయేరియా, డెంగీ వంటివి ప్రబలే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే పరిస్థితి తీవ్రమవుతుంది. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

డయేరియా

కలుషిత ఆహారం, కలుషిత నీటిని తాగడం, ఎక్కువ కాలం పాటు నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినడం ద్వారా డయేరియా వ్యాపించే ప్రమాదం ఉంది. వాంతులు, విరేచనాలు అవుతాయి. చాలా నీరసంగా తయారవుతారు. శరీరంలో నీటి శాత తగ్గడంతో డీహైడ్రేషన్‌కు గురవుతారు. రోగ నిరోధక శక్తి తగ్గిపోయి ప్రాణాప్రాయం సంభవిస్తుంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చక్కెర, ఉప్పు కలిపిన నీటిని తాగడం ద్వారా కొంత ఉపశమనం పొందవచ్చు.



కలరా..

పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో అస్తవ్యస్త పరిసరాలే ఈవ్యాధి వ్యాప్తికి ప్రధానకారణం. దోమలు, ఈగలు వాలిన ఆహారపదార్థాలను తినడం ద్వారా కలరా వ్యాపిస్తుంది. వాంతులు, వీరేచనాలు అవుతా యి. తద్వారా పూర్తిగా నీరసంగా మారి నడువలేని స్థితికి చేరుకుంటారు. వెంటనే చికిత్స అందించకపోతే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది.

మలేరియా

ఇది దోమ కాటుతో వ్యాప్తి చెందుతుంది. తీవ్రమైన జ్వరం ఉంటుంది. శరీరం ఏ పనిచేయకుండానే అలసటకు గురవుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. కీళ్ల నొప్పులు వచ్చి, వాంతులు, విరేచనాలు అవుతాయి. చర్మం పచ్చగా మారడం, అతిగా చెమట రావడం వంటివి కనిపిస్తాయి.

డెంగ్యూ

వర్షాకాలంలో అతి వేగంగా వ్యాపిస్తున్న మరో ప్రమాదకరమైన వ్యాధి డెంగ్యూ. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమకాటుతో వ్యాపిస్తుంది. విపరీతమైన జ్వరం ప్లేట్‌లెట్‌లు పడిపోవడం, తలనొప్పి, కీళ్లనొప్పులు, శరీరంపై దద్దుర్లు, జలుబు, దగ్గు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం వస్తూ, పోతూఉంటుంది. సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణానికే ముప్పు ఏర్పడుతుంది.

వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు

వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ముందస్తు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఇంటి పక్కల పరిసరాలే కాకుండా మురుగు కాలువలు, పెంట కుప్పలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ఇంటి పరిసరాల్లో, గుంతల్లో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలి. క్లోరినేషన్ చేసిన నీటినే వినియోగించాలి. అపరిశుభ్రంగాఉండే పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు.

ఆహారంలో జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో చిరుతిండ్లకు దూరంగా ఉండాలి. ఆహారం తినే ముందు, తర్వాత చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలి. దోమతెరలు, కాయిల్స్ వంటివి వాడాలి. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఆహార పదార్థాలపై దోమలు, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడు తినాలి. తాజా కూరగాయలను వండుకోవాలి. కాచి వడబోసిన నీటిని తాగాలి.

కొనసాగుతున్న జ్వర సర్వే

డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



ఇంటింటి జ్వర సర్వే కొనసాగుతోంది. మే 30న కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం ని ర్వహించాం. అప్పటి నుంచే ముందుస్తు చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం కేసులు తక్కువగా నమోదయ్యాయి. మలేరియాకు సంబం ధించిన రక్త పరీక్షలు చేస్తున్నాం. సిబ్బందికి తగిన సూచనలు చేశాం. ఎక్కడైన మలేరియా కేసు నమోదైతే చుట్టు పక్కన 50 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన


ఓపెన్ స్లాబ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో రాధాబాయి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పర్యవేక్షణ చేపట్టారు. ఓపెన్‌స్లాబ్, కల్యాణ కట్ట, మెయిన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్ల జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆమె వెంట ఆలయ ఈఈ రాజేశ్, ఈఈలు రఘునందన్, మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, సంతోష్, నాగురి నరేందర్, స్థానాచార్యులు నమిలికొండ ఉమేష్‌శర్మ, ప్రధాన అర్చకులు ఈశ్వరగారి సురేష్, చంద్రగిరి శరత్ కుమార్, తుమ్మల వెంకన్న తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి, శేషవస్త్రంతో సత్కరించారు.

వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల కారణంగా సంభవించే భారీ వరదలు, వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా రావుల చెరువుకట్టలోని హనుమాన్ ఆలయ ఆవరణలో వినాయక మండపంలో గణపతి హోమంలో మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా కొన్ని జిల్లాల్లో పంటలకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. పంట పొలాల్లోకి నీరు చేరి నష్ట పోయారన్నారు. నష్ట పోయిన రైతులను ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో ప్రజా అభివృద్ధి, సంక్షేమానికి ఆటంకాలు కలగవద్దని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం గాంధీచౌక్ లో రూ.48 లక్షలతో వైకుంతరథం, ఫ్రీజర్ బాక్స్‌లను ప్రారంభించారు. రూ. 1.28 లక్షల విలువ చేసే కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై ప్రధాని పరిశీలించాలి..

- రూ.150కోట్లతో నిర్మించే ఈఎస్ఐ ఆసుపత్రికి టెండర్లు పూర్తి
- ఎయిర్ పోర్టుపై అధ్యయనం జరుగుతుంది

ఎంపీ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

గోదావరిఖని, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మేకిన్ ఇండియా అంటూ ఊదరగొడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్ఎఫ్‌సీఎల్ యూరియా ప్లాంట్ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పరిశీలన జరుపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేక్ ఎంపీగా ఉన్న సమయంలో రూ.10కోట్ల అప్పులు మాఫీ చేయించి మన్మోహన్‌సింగ్ సర్కార్ ద్వారా ప్లాంట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో యాజమాన్య నిర్లక్ష్యం వల్ల సాంకేతిక వైఫల్యాలు ఏర్పడుతున్నాయని, దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరుపాలన్నారు.

ఇప్పటికే కేంద్ర ఎరువుల రసాయనాలశాఖ మంత్రి నడ్డ, రసాయనాలశాఖ కార్యదర్శి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. ఆర్ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని రామగుండానికి తరలించి నప్పుడు మాత్రమే పరిస్థితులు మెరుగవుతాయన్నారు. యూరియా కొరత ఏర్పడడానికి కేంద్ర విధానాలే కారణమని, ఇప్పటికీ విదేశాల నుంచి యేటా 50లక్షల టన్నుల యూరియాను దిగుమతి చేసుకుంటున్నారన్నారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే యూరియా విషయంలో ముందు చూపులేకపోవడం వల్ల యూరియా కొరత ఏర్పడి రాష్ట్రాలకు కోటా తగ్గించారన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి కోటా ఇచ్చి ప్లాంట్ మూలనపడడం వల్ల ప్రత్యామ్నాయం కూడా చేయలేని పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ ఎంపీలు ఒత్తిడి తెస్తే 50వేల టన్నుల యూరియా ఇచ్చేందుకు ఒప్పుకున్నారని, త్వరలోనే 25వేల టన్నులు అందుబాటులోకి రానున్నదన్నారు. రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేసి ఐదేళ్లు అయినా టెండర్లు నిర్వహించలేదని, తాను, మంత్రి వివేక్‌లు కేంద్ర మంత్రి మాండవియను కలిసి విజ్ఞప్తి చేయడంతో రూ.150 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారన్నారు.

రామగుండంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని తాము కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని, దీనిపై అధ్యయనం జరుగుతుందన్నారు. కన్నాలలో రూ.80 కోట్లతో రైల్వే అండర్‌పాస్ నిర్మాణంపై సానుకూలత తెలిపారని, త్వరలోనే అన్నీ క్లియరెన్స్‌లు లభిస్తాయన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచే అంశంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని, పెన్షన్ ట్రస్ట్‌లో లోటును భర్తీ చేసేందుకు టన్నుకు రూ.20చొప్పున కేటాయిస్తున్నారని, అవి కేవలం పెన్షన్‌కే సమకూర్చుతారన్నారు. ఓట్ల చోరీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో బట్టబయలు చేశారని, బీహార్‌లో చేపట్టిన యాత్రకు భారీ స్పందన లభించిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి


రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రెటరీ అలగు వర్షిణి


మాట్లాడుతున్న అలగు వర్షిణి

జగిత్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రెటరీ అలగు వర్షిణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యా లయంలో గల ఆడిటోరియంలో జిల్లా కలె క్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతలతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. గిరిజన గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. జిల్లాలో ఇప్పటికే అందించిన నివేదికల ప్రకారం ప్రత్యేక నిధులను కేటాయించినట్లు తెలిపారు. అధికారులు అందించే ప్రతిపాదనలు సమీక్షించి వాటికి కావాల్సిన నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజుకుమార్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సోదరుడికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

తిమ్మాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రెండోసోదరుడు రాజేశం దశదినకర్మ అలుగునూర్‌లోని శ్రీలక్ష్మీ నరసింహగార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన రాజకీయ ప్రముఖులు, జిల్లాస్థాయి అధికారులు, నాయకులు, పోలీసు అధికారులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ పెద్దకర్మ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, వర్ధన్నపేట మాజీఎమ్మెల్యే ఆరూరి రమేష్, మాజీఎమ్మెల్యేలు మోత్కుపల్లి నరసింహులు, మాజీ ఎమ్మెల్సీ దర్పల్లి రాజేశ్వరరావు, మెన్నేని రోహిత్‌రావు, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, స్టేట్‌హౌసింగ్ ఫెడరేషన్ మాజీచైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధిపతి నరేందర్‌రెడ్డి, ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయ కుడు అంబటి జోజిరెడ్డి, టీడీపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరు పతి, ఇతర నాయకులు హాజరై ఎమ్మెల్యే సోదరుడు రాజేశం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నివాళులు అర్పించి అధికారులు..

పెద్దకర్మ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సంజీవ్ కుమార్ ఝా, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ భగవత్ గీతే, కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, మున్సిపాల్ కమిషనర్ తానాజీ, నగర ఏసీపీ వెంకటరమణ, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సిద్దిపేటరూరల్ ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు హాజరై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు రాజేశం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

నేడు ఉమ్మడి జిల్లా మినీ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా మినీ అండర్-12 బాలబాలికల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని ఫండస్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 31న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర జట్ల పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. 1-1-2013 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో పాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని మధ్యాహ్నం 1 గంటకు ఫండస్ పాఠశాలలో జిల్లా సంఘ సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, పీఈటీ స్వామీట్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు..


పదిర, రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య మానేరు వాగు ఉధృతి..


నారాయణపూర్ గ్రామంలో ప్రవాహిస్తున్న వాగు


నర్మాలలో నీట మునిగిన వరి పంట


నర్మాలలో పంట పొలాల్లో ఇసుక మేటలు..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని గ్రామాల్లో భారీ వర్షాలకు చెరువులు మత్తడి దూకుతున్నాయి. నారాయణపూర్, కోరుట్లపేట, సింగారం, రాచర్లతిమ్మాపూర్, పదిర, మద్దిమల్ల తదితర గ్రామాల శివారులోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ సుజాత, ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో వాగుల వద్ద బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలానికి సాగునీటి వర ప్రదాయిని అయిన సింగసముద్రం చెరువు మత్తడి దూకుతోంది. నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతోంది. సాగు నీటి వనరులు జలకళను సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు వద్ద రోడ్డు ధ్వంసం అయ్యింది. భారీ వర్షాలకు మానేరు ఉప్పొంగడంతో రోడ్లపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాహనాలు నడవలేని దుస్థితిలో అధ్వానంగా మారాయి. తొందరగా రోడ్డును మరమ్మతు చేయాలని ప్రజలు కోరారు.

కాగా, గంభీరావుపేట మండలం నర్మాల మానేరు పరివాహక ప్రాంతాల్లో పంటలకు అపార నష్టం వాటిల్లింది. వర్ష బీభత్సానికి పంట పొలాల్లో ఇసుక మేటలు, చేలకు గండ్లు పడటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరి కొన్నిచోట్ల వరి పంటలు నీట మునిగిపోయాయి. ప్రధానంగా వరి పంట కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మానేరు పరివాహక ప్రాంతాలైన గంభీరావుపేట, నర్మాల, కోళ్లమద్ది, లింగన్నపేట, మల్లారెడ్డిపేట తదితర గ్రామాల్లో వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది.

వెంటనే సంబంధిత అధికారులు పంట నష్టాలను సర్వే చేసి, బాధిత రైతులకు నష్టపరిహారం అందజేయాలని ప్రజా సంఘాల నాయకుడు కల్యాణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల బదిలీలు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలను శుక్రవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కౌన్సెలింగ్ ద్వారా చేపట్టారు. సంస్థ సీఈవో ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎల్2, ఎల్1, ఎంఎస్ సీసీఎస్‌లో పనిచేస్తున్న 53మంది ఉద్యోగులకు కలెక్టర్ కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలతో దెబ్బతిన్న విద్యుత్ లైన్లకు మరమ్మతు..

- జిల్లాలో రూ.50లక్షల విలువ నష్టం వాటిల్లినట్లు అంచనా

-సెస్ చైర్మన్ చిక్కాల రామరావ్


రైతులతో కలిసి దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న చిక్కాల రామారావు

తంగళ్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో దెబ్బతిన్న విద్యుత్ లైన్లకు మరమ్మత్తులు చేస్తామని రైతులు, ప్రజలు ఆందోళన చెందవద్దని సెస్ చైర్మన్ చిక్కాల రామారావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కస్బేకట్కూర్ చింతలపల్లె, గండిలచ్చపేట, వేణుగోపాల్‌పూర్ గ్రామాల్లో సెస్ చైర్మన్ చిక్కాల రామరావ్, అధికారులు పర్యటించి నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మలను పరిశీలించారు. రైతులతో మాట్లడి త్వరలోనే మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని సెస్ డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సెస్ సంస్థకు సుమారు రూ.50లక్షలమేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. వర్షాలు తగ్గగానే పూర్తిస్థాయి నష్టం అంచనా వేసి మరమ్మతు పనులు చేపడుతామన్నారు. వర్షాలతో విద్యుత్తు ప్రమాదలు జరిగే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట పరిధిలో రామంజపురంలో మూడు రోజులుగా విద్యుత్తు సరఫరా లేదని దృష్టికి వచ్చిందన్నారు. గ్రామానికి నలుమూల నీటి ప్రవాహం ఉండడంతో అక్కడికి సిబ్బంది వెళ్లలేని పరిస్థితి ఉందని, నీటి ప్రవాహం తగ్గగానే మరమ్మతులు చేపడుతామన్నారు. మండలంలో పలుగ్రామాల్లో విద్యుత్ నష్టం సుమారు రూ.8లక్షల వరకు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సెస్ ఏడీ శ్రీధర్, ఏఈ మధుకర్‌లు ఉన్నారు.

కుంకుమ పూజలు.. అన్నదానాలు


ఎల్లారెడ్డిపేటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలతో పాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, పదిర, దుమాల, అల్మాస్‌పూర్, రాచర్లగుండారం, రాచర్లతిమ్మాపూర్, కంచర్ల, అడవిపదిర, గర్జనపల్లి, వన్‌పల్లి తదితర గ్రామాల్లోని యువజన, కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి తనయా గజానన అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పురోహితుడు దయానంద్ శర్మ నేతృత్వంలో మహిళలు భక్తిశ్రద్ధల నడుమ కుంకుమ పూజలు జరిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, పలువురు నాయకులు ఏకదంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రాపల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్, ఉపాధ్యక్షులు గోస్కి దేవదాస్, శ్రీరాం సుదర్శన్, కోశాధికారి వనం బాలరాజు, సంయుక్త కార్యదర్శి రాపల్లి అంబదాస్, యువజన విభాగం అధ్యక్షుడు సుంకి బాస్కర్, ప్రధాన కార్యదర్శి సుంకి విష్ణు, ఉపాధ్యక్షుడు గోస్కె శ్రీనివాస్, కుల, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు


గాలిపెల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఇల్లంతకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. యూరియా విక్రయకేంద్రాలకు వచ్చిందని తెలుసుకుంటున్న రైతులు తెల్లవారక ముందే క్యూలో నిలబడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలోని విక్రయకేంద్రాలకు 60 టన్నుల యూరియా వచ్చింది. విక్రయకేంద్రాలకు వచ్చిన యూరియా బస్తాలు తక్కువగా ఉండటం రైతులు ఎక్కువగా ఉండటంతో పోలీసుల సహకారంతో క్యూ కట్టించారు. గాలిపెల్లి గ్రామంలో ఆధార్‌కార్డుకు కేవలం ఒకే యూరియా బస్తా ఇస్తామని అధికారులు పేర్కొనడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. తాము వేసిన పంటలకు ఒక్క బస్తా ఇస్తే ఎన్నిరోజులు క్యూలోనిల్చోవాలని ప్రశ్నించారు. వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతు రైతులు ఆందోళన చెందవద్దని కందికట్కూర్, గాలిపెల్లి, ముస్కానిపేట, రేపాక గ్రామాలలో శుక్రవారం పంపిణీ చేశామని, రైతులందరికి సరిపడ యూరియాను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరం మేరకు మాత్రమే యూరియాను తీసుకపోవాలని సూచించారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

కోనరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ కోరారు. కోనరావుపేటలో శుక్రవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం, తీగల రవీందర్ గౌడ్, బైరగోని సురేష్‌గౌడ్, చింతల పర్శరాములు, మధు, పురుషోత్తం రావు, తిరుపతి గౌడ్, జింక వెంకటి, మోత్కు మోహన్, రాములు, జయంతిరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సింగసముద్రం చెరువు జలకళను సంతరించుకున్న నేపథ్యంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్యలు స్థానిక నాయకులతో కలిసి శనివారం సందర్శించారు. గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మరెడ్డి, నాయకులు గౌస్, బాల్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, గిరిధర్‌రెడ్డి, గోపాల్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, వెంకటేశ్, రమేశ్, బాలయ్య, రామచందర్, రాములు, రవీందర్ ఉన్నారు.

ఆరేళ్లుగా 'బడి తోట' సాగు..

తంగళ్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒబులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ఆరేళ్లుగా 'బడి తోట' సాగు చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పాఠశాల హెచ్ఎం బండి ఉపేందర్ ఇందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. బడి తోట సాగుపై విలేకరులకు వివరించారు. కూరగాయల పెంపకానికి ఉపాధ్యాయలు బూట్ల శ్రీనివాస్, పలుమార్ తిరుపతి, గట్టు శ్రీకాంత్, అవధానుల జ్యోతి రాణి, ఎలిగేటి శ్రీనివాస్, భూమేష్, పవిత్ర సహకరిస్తున్నారన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


సిరిసిల్లలో విజేతలకు ట్రోఫీ అందిస్తున్న అధికారి రాందాస్


చందుర్తి మండలం నర్సింగాపూర్ పాఠశాలలో క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జీవితాన్ని క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మినీ స్టేడియంలోని మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రాందాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాలీబాల్, ఆర్చరీ, కబడ్డీ పోటీలను రాందాస్ ప్రారంభించారు. పోటీలలో విజేతలకు ట్రోఫీలను అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ సారధ్యంలో ఒలంపిక్స్ క్రీడలలో భారత దేశానికి బంగారు పతకాలను అందించాడని అన్నారు. క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో రాణించి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ సిబ్బంది, వాలీబాల్ అకాడమీ కోచ్‌లు, కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ అసోసియేషన్స్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగుభాషాదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో విద్యార్థులకు కథలు, పఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనువేజు రాజు, తాటిపెల్లి నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలకు 100 మీటర్లు, షాట్‌పుట్, బాలురకు 200మీటర్ల షాట్‌పుట్ విభాగంలో క్రీడాపోటీలను ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడారు. క్రీడాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ లావణ్య, శకుంతల, కృష్ణప్రసాద్, కరుణ, నరసయ్య, శారద, బాబా తదితరులు ఉన్నారు.

● చందుర్తి : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని నర్సింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జితేందర్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా విద్యార్థులకు కబడ్డీ కోకో, షార్ట్‌పుట్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించి భారతి ఫౌండేషన్ సౌజన్యంతో బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడి అశోక్, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, పావని, బనాజి, మహేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, కార్తీక్, సాగర్ పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరినాథ్, కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగానర్సయ్య, పడాల నరేష్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, విజయ్, చందర్, సునీల్, రమేష్, కిరణ్, సృజన్, శిరీష, సాయి పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట కేజీ టూ పీజీ ప్రాంగణంలో సైమా క్రీడా అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా చిన్నారులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కోచ్ విక్రమ్, యోగా కోచ్ దేవయ్య, ఫిట్నెస్ కోచ్ జంపన్న ఉన్నారు.

● కోనరావుపేట : మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఎంఈవో శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపన్యాసాలు, పెయింటింగ్ పోస్టర్, మేకింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వేములవాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పంచాయతీ ఓటర్ల లెక్క సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ఒక పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. 260 సర్పంచ్‌లు, 2268 వార్డులకు ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచారు. సర్పంచ్ ఎన్నికలకు పెద్ద బాక్సులు, వార్డు సభ్యులకు చిన్న బ్యాలెట్ బాక్సులు జిల్లాకు వచ్చాయి. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల ప్రక్రియను కూడా పూర్తిచేశారు. అంతకుమించి ఓటర్లుంటే రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేస్తారు. 200మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650వరకు ఉంటే ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఇల్లంతకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్టీయు పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మన్, ప్రధానకార్యదర్శి రోహేజు సదానందంలు పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో శుక్రవారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా అరుకుటి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా గుండ్లపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, తిరుమల్, రాజ్‌కుమార్, కోశాధికారిగా సురేష్, మహిళా ఉపాధ్యక్షులుగా పద్మజ, అరుణకుమారి, జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్, రమేష్, అబ్రార్, దేవేందర్, కార్యదర్శులుగా శంకర్, సంపత్, రమేష్, రాములు, శ్రీలత, నిర్మల, సభ్యులుగా శ్రీనివాస్, సుల్తానాలు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన మల్లేశంకు పలువురు అభినందనలు తెలిపారు.

నియామకం

ఇల్లంతకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : యువజన కాంగ్రెస్ మండల సోషల్‌మీడియా అధ్యక్షుడు కాసుపాక రమేష్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. మండలకేంద్రానికి చెందిన రమేష్ కాంగ్రెస్‌పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. పార్టీ అధికారంలో లేనిసమయంలో ప్రజల పక్షాన ఉద్యమాలు చేపట్టాడు. ఈసందర్భంగా రమేష్ మాట్లా తన నియామకానికి సహకరిరించిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'అన్నదాతలను పట్టించుకోని ప్రభుత్వం'

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు అందె సుభాష్ అన్నారు. సింగసముద్రం చెరువు మత్తడి దూకుతున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. యూరియా, కరెంటు సమస్యలతో సతమవుతున్న రైతులు ప్రభుత్వం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీమేశ్వర్, దేవరెడ్డి, శివరాములు, సత్యం, కల్యాణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

శ్రమదానంతో తాత్కాలిక రోడ్డుకు మరమ్మతు


మట్టిని చదును చేయిస్తున్న గ్రామస్థులు

బోయినపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి శివారున గల గంజివాగు వద్ద తాత్కాలికంగా వేసిన రోడ్డు వరదకు తెగిపోవడంతో శుక్రవారం ప్రజలు శ్రమదానంతో మరమ్మతులు నిర్వహించారు. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే మార్గంలోని గంజివాగుపై హైలెవల్ వంతెన నిర్మించేందుకు గతప్రభుత్వంలో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు వంతెన పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రస్తుత వర్షాలకు తాత్కాలికంగా వేసిన రోడ్డు సైతం కోతకు గురికావడంతో గుండన్నపల్లి, స్తంభంపల్లి గ్రామాల ప్రజలు శ్రమదానంతో మొరం పోసుకుని రోడ్డు బాగుచేసుకున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి పనులను పూర్తిచేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కనపెల్లి జ్యోతి, కరుణాకర్, కొప్పుల మధు, అక్కెనపల్లి కళ్యాణ్, బొంగానీ అశోక్, కస్తూరి బాపురెడ్డి, అక్కెనపల్లి పరశురాములు, అజయ్, కార్తీక్, మేడుదుల మల్లేశం, మేడుదుల రమేష్, చంద్రగిరి మహేందర్, విజయ్, మోహన్‌దాస్, గణేష్, సురేష్, గంగయ్య, శ్రీనివాస్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీల భర్తీకి ప్రత్యేక ప్రవేశ ప్రక్రియ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఉన్నత పాఠశాల, ఇంటర్‌లో ఖాళీలభర్తీకి ప్రత్యేక ప్రవేశ ప్రక్రియను చేపడుతున్నామని ప్రిన్సిపాల్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 10వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థులు ఈనెల 30న ఉదయం 10 గంటలకు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యార్హత పత్రం, ఆధార్ కార్డు, టీసీలతో హాజరుకావాలని తెలిపారు.

గ్రామ పంచాయతీలో ఓటరు జాబితాల ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు ఓటరు జాబితాలను ప్రదర్శించారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, వివిధ పార్టీల నాయకులు జాబితాను పరిశీలించారు. జాబితాలో తప్పులు దొర్లితే సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని నాయకులు సూచించారు. మార్పులు, చేర్పుల కోసం ఈనెల30లోగా ఫారం 6 ద్వారా దరఖాస్తులు చేయాలన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం..

తంగళ్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ సర్పంచ్ అంకారపు అనిత రవీందర్ దంపతులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ముద్రకోల లోకేష్ మృతిచెందగా కుటుంబ సభ్యులకు రూ.5వేలు, పద్మనగర్‌కు చెందిన వేముల కరుణాకర్ కుటుంబానికి రూ.3వేలు అందజేశారు. ఈ బీఆర్ఎస్ నాయకులు పడిగెల రాజు, బండి జగన్, కందుకూరి రామగౌడ్, వెంగళ రమేశ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్‌లు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం మండలానికి చెందిన పలువురు బీజేపీ జిల్లాస్థాయి పదవులు పొందగా వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కోల ఆంజనేయులు, కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ జూకంటి అఖిల్, మండల ప్రధానకార్యదర్శి ఇటికల రాజు, కోసిని వినయ్‌యాదవ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, కాశీగంటి రాజు, కోడం భవిత, ఇటికల మహేందర్, బక్కశెట్టి రాజేందర్, కలికోట కాశీ చరణ్, అమరగొండ రాజు, జంగం కిషన్, గోనెపెల్లి శ్రీనివాస్, భాస్కర్, కర్నె గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుద్దాల మాజీ సర్పంచ్ మృతి

కోనరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల మాజీ సర్పంచ్ ఏనుగు సుజాత గురువారం రాత్రి వృద్ధాప్యంతో అనారోగ్యానికి గురై మృతిచెందారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, దొబ్బల ప్రవీణ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ తరగతుల పర్యవేక్షణ

కోనరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలను మహిళాశిశు సంక్షేమ శాఖ తరఫున మహిళ సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ బోనాల రోజా, ఫైనాన్స్ లిటరసీ రమ్య శుక్రవారం పర్యవేక్షించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఐఐటీ నీట్ ఫౌండేషన్ కోర్సులు ఎలా జరుగుతున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.